# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 319
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
అక్టోబర్ 03, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




పోలీస్ కమిషనరేట్‌లో..
## ఘనంగా ఆయుధ పూజ
2లో..



8లో..

## ఘనంగా శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ముగిసిన దేవీశరన్నవరాత్రోత్సవాలు



8లో..

## అందరి బంధువు ‘దత్తన్న’
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



8లో..

## దారి ఇలా.. నడిచేదెలా..?
- అధ్వానంగా వెలికట్టె-సన్నూరు దారి
- వర్షాలతో బురదమయమైన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, వాహనదారులు




# పల్లెల్లో.. రిజర్వేషన్ చిచ్చు

వివరాలు 2లో..

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు.. మండలంలోని అనేక పల్లెల్లో చిచ్చు పెట్టింది. జనాభాకు, రిజర్వేషన్లకు పొంతన లేకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. కొన్ని గ్రామాల్లో అక్కడ నివసించే జనాభాతో సంబంధం లేకుండానే అభ్యర్థుల రిజర్వేషన్లు ఖరారుకావడం అయోమయానికి గురి చేస్తోంది. దీంతో కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం ప్రధాన పార్టీలకు సైతం అభ్యర్థులే కరువయ్యారు. గ్రామాలకు రిజర్వేషన్ల ఖరారుతో ‘ఈ ఎన్నికలు ఎవరి కోసం?’ అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇష్టానుసారంగా జరిగిన రిజర్వేషన్లపై ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నవారి ఆశలపై రిజర్వేషన్లు నీళ్లు చల్లినట్లైంది. దీంతో స్థానికంగా ఉన్న జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను మార్చాలన్న డిమాండ్ పెరుగుతోంది. లేకుంటే స్థానిక రిజర్వేషన్లపై పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. - వరంగల్ వాయిస్, దామెర

- గందరగోళంగా స్థానిక ఎన్నికలు
- రిజర్వేషన్ల ఖరారుతో ఆగమాగం
- జనాభాకు, రిజర్వేషన్లకు లేని పొంతన
- అభ్యర్థులు లేక ఇబ్బందులు



# పల్లెల్లో 'రిజర్వేషన్' చిచ్చు

- గందరగోళంగా స్థానిక ఎన్నికలు
- రిజర్వేషన్ల ఖరారుతో ఆగమాగం
- జనాభాకు, రిజర్వేషన్లకు లేని పొంతన
- అభ్యర్థులు లేక ఇబ్బందులు

**వరంగల్ వాయిస్, దామెర :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. పోటీ చేసేందుకు ఆశావహులు ఇప్పటికే పావులు కదుపుతున్నారు. అయితే పలు మండలాల్లో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు అనేక గ్రామాల్లో తీవ్ర గందరగోళానికి దారితీసింది. ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్లకు, ఆయా గ్రామాల జనాభా నిష్పత్తికి ఏ మాత్రం పొంతన లేకపోవడంతో దామెర ప్రాంతంలోని పల్లెల్లో 'ఎన్నికలు ఎవరి కోసం?' అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. టికెట్ కోసం ఆశగా ఎదురు చూస్తున్న ఆశావహులకు రిజర్వేషన్ల కేటాయింపు ఆందోళన కరంగా మారింది.

### అయోమయంలో గ్రామాలు..

స్థానిక రిజర్వేషన్ కేటాయింపులపై దామెర మండలంలోని పలు గ్రామస్తులు పూర్తిగా అయోమయంలో పడ్డారు. అది ఓటు వేయడానికి సైతం అర్హులు లేని వర్గానికి రిజర్వ్ చేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజా రిజర్వేషన్ల ప్రక్రియలో తప్పులు దొర్లాయని, దీనిపై వెంటనే అధికారులు దృష్టి సారించాలని పలువురు రాజకీయ పక్షాల నేతలు, గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. కేవలం కాగితాల్లోని లెక్కల ఆధారంగా కాకుండా, గ్రామాల్లోని వాస్తవ జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లను కేటాయించాలని కోరుతున్నారు. లేదంటే, అభ్యర్థులు లేకుండానే ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి వస్తుందంటున్నారు. తక్షణమే ఈ రిజర్వేషన్లను సవరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ చిచ్చు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు కొనసాగే అవకాశం ఉందని స్థానిక పరిశీలకులు భావిస్తున్నారు. రిజర్వేషన్లను మార్చేంతవరకు ఆందోళనలు కొనసాగిస్తామని పలు గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# పోలీస్ కమిషనరేట్ లో.. ఘనంగా ఆయుధ పూజ

**వరంగల్ వాయిస్, క్రైం :** విజయదశమి పండుగను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. హనుమకొండలోని ఆయుధ భాండాగారం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై దుర్గామాతతో పాటు ఎంటీ విభాగంలో పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఆవరణలోని శమీ వృక్షానికి పూజలు చేసి అధికారులు, సిబ్బందికి శమీపత్రాలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చివరగా పోలీస్ కమిషనర్ ఎంటీ విభాగంలో పోలీస్ కమిషనర్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈస్ట్ డీసీపీ అంకిత్ కుమార్, క్రైం డీసీపీ గుణ శేఖర్ అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ఏఎస్పీ శుభం, ఏసీపీలు నాగయ్య, మధుసూదన్, అనంతయ్య, సురేంద్ర, ఆర్ఐలు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# 99 శాతం హామీలు అమలు చేశాం

- స్థానిక సమరానికి క్యాడర్ సిద్ధంగా ఉండాలి
- ఆర్థిక, పాలన వ్యవస్థలను బీఆర్ఎస్ విధ్వంసం చేసింది
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు మండలం ఇంచెర్ల ఎంఆర్ గార్డెన్ లో స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా వెంకటాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేండ్లలో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేశారని, వాటిని ప్రణాళిక ప్రకారం సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పీటీసీలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లవలసిన అవసరం ప్రతి ఒక్క కార్యకర్త పై ఉందన్నారు. రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పేద కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందే అన్నారు. రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇచ్చి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రామ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువతకు స్ఫూర్తి గుంటక నరసయ్య పంతులు

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్
- ఘనంగా 122వ జయంతి వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, కవి గుంటక నరసయ్య పంతులు ఉద్యమ నేపథ్యం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఓబీసీ జనరల్ సెక్రెటరీ ఆచార్య గడ్డం భాస్కర్ కొనియాడారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో ఆయన చేసిన సమాజ హిత సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. నరసయ్య పంతులు 122వ జయంతి వేడుకలను ఓబీసీ హనుమకొండ ర్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బీసీ చేనేత వర్గానికి చెందిన ఈ నాయకుడి చరిత్రను నేటి యువతకు స్ఫూర్తిగా అందించాలనే సంకల్పంతో ఈ వేడుకలను నిర్వహించామని తెలిపారు. నరసయ్య పంతులు మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడిచి, ఖాదీ ఉద్యమానికి, చేనేత ఉద్యమానికి ఎనలేని కృషి చేశారు. చేనేత పారిశ్రామికులకు సహకార సంఘాలను బలోపేతం చేశారు. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ను తన అధ్యక్షతన ఏర్పాటు చేశారు. డెక్కన్ చరక సొసైటీ స్థాపించి పారిశ్రామికులకు ఉపాధి కల్పించారు. ఆయన స్థాపించిన 'స్వదేశీ ఖాదీ వస్త్రాలయం' నేటికీ కోఠి బజారులో ఆయన వారసులచే నడపబడుతోంది. పద్మశాలి కులంలో జన్మించిన నరసయ్య పంతులు పద్మశాలి సమాజ వికాసానికి, చేనేత ఉద్యమానికి, విద్యారంగానికి నిరంతరం పాటుపడిన మహోన్నత భావాలు గల వ్యక్తి అని కొనియాడారు. భారత స్వాతంత్ర ఉద్యమంతో పాటు, తెలంగాణలో వెట్టి చాకిరి నిర్మూలన ఉద్యమంలో, అలాగే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారు.




ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి కొండంత అండగా నిలిచారు. ప్రతి ఉద్యమ కార్యక్రమంలో బాపూజీకి చేదోడు వాదోడుగా ఉంటూ, కింగ్ మేకర్‌గా చరిత్రలో తన పేరును సుస్థిరం చేసుకున్నారు. పద్మశాలి ప్రతిభను సమాజ సేవకు వినియోగించుకోవాలని లోతైన అధ్యయనం చేసిన పంతులు 'భృగ్వాదుల ప్రభావం అను గ్రంథం' రచించి కుల బంధువులను ఏకతాటిపైకి నడిపించారు. ఆయన అఖిల భారత పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడిగా యువతను ఏకం చేశారు. ఇతర రాష్ట్రాలకు (ముంబై, సోలాపూర్, సూరత్ వంటి నగరాలు) ఉపాధి కోసం వలస వెళ్లిన తెలుగువారి కోసం తెలుగు మీడియం పాఠశాలలను స్థాపించారు. పేద, మధ్యతరగతి పద్మశాలి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని, ఉన్నత పదవుల్లో రాణించాలని ఉద్దేశంతో వసతి గృహాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం శాశ్వత నిధి ఏర్పాటు చేసి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించిన మొట్టమొదటి దానకర్త ఆయనే అని భాస్కర్ పేర్కొన్నారు. తన జీవిత కాలంలో చేసిన సామాజిక కార్యక్రమాలకు గుర్తింపుగా నరసయ్య పంతులుని 'యువక కిషోర మణి', 'చేనేత ఉద్యమ పితామహ' వంటి బిరుదులు వరించాయి. ఆయన చరిత్రను ఒక పాఠ్యాంశంగా పరిగణించి, నేటి తరం భవిష్యత్ తరాలకు భరోసానిచ్చే విధంగా మెలగాలని ఓబీసీ కోరుకుంటుంది. ఓబీసీ జాయింట్ సెక్రెటరీ గంగపురం మాట్లాడుతూ గుంటకల్ నరసయ్య పంతులు ఆర్థిక విధానాలు చేనేత కార్మికుల భవిష్యత్తుకు మూలంగా పేర్కొన్నాడు. ఆయన చేసిన సేవలు కొండా లక్ష్మణ్ బాపూజీకి ప్రత్యేకమైన గుర్తింపును అనడంలో ఎలాంటి సందేహం లేదు. మరొక జాయింట్ సెక్రెటరీ ఎంఎం.మూర్తి మాట్లాడుతూ పంతులు ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. ఓబీసీ సభ్యులైన గుండేటి చక్రపాణి, తుమ్మ శ్రీనివాస్, రాజు యాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు

- 70 అడుగుల రావణ ప్రతిమ దహనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




**వరంగల్ వాయిస్, కరీమాబాద్జ/ఉర్సుగుట్ట :** వరంగల్ నగరంలోని ఉర్స్ రంగలీల మైదానంలో గురువారం సాయంత్రం నిర్వహించిన దసరా సంబరాలు అంబరాన్నంటాయి. చెడుపై మంచి సాధించిన విజయాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాసనమండలి ఉపసభాపతి బండ ప్రకాష్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ సలిమాలతో కలిసి మంత్రి కొండ సురేఖ ఆటోమెటిక్ స్విచ్ ఆన్ చేసి రావణ వధ, దసరా వేడుకలను ప్రారంభించారు. దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్ బాబు, జనరల్ సెక్రెటరీ మేడిది మధుసూదన్, ట్రస్ట్ చైర్మన్ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పది తలలతో కూడిన 70 అడుగుల రావణ ప్రతిమ దహన ఘట్టం నేత్రపర్వంగా జరిగింది. మిరుమిట్లు గొలిపే వెలుగుల్లో బాణసంచా పేలుళ్లతో ప్రాంగణమంతా మార్మోగింది. అంతకుముందు, కరీంబాద్ రామస్వామి గుడి నుంచి సీతారామాంజనేయ, లక్ష్మణుడి విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి, వేలాది మంది భక్తులు వెంటరాగా శోభాయాత్ర



రంగలీల మైదానానికి చేరుకుంది. ఈ యాత్ర కోలాటం, డప్పు చప్పుళ్ళు, వాయిద్యాలు, భజనలు, నృత్యాల నడుమ ఉత్సాహంగా సాగింది. అనంతరం శమీ పూజ, పాలపిట్ట దర్శనం నిర్వహించారు. ఈ వేడుకల్లో పేరిణి శివతాండవం, కూచిపూడి నృత్యాలు, విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, రాణిరుద్రమ్మ, జానపద గేయాలు, తెలంగాణ ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యువతీ యువకులు కేరింతలు కొడుతూ సంబరాల్లో మునిగితేలారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ... చెడుపై విజయం సాధించిన రోజునే ప్రజలు విజయదశమిగా జరుపుకోవాలని ఆనవాయితీగా వస్తోందని, దసరా విశిష్టతను గురించి వివరించారు. రంగలీల మైదానంలో భక్తుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తమ ఏర్పాట్లు చేయడంపై మంత్రి ధన్యవాదాలు తెలిపారు. నగర నలుమూలల నుండి వచ్చిన ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి, నగర మేయర్‌తో కలిసి రంగశాయిపేట, కొత్తవాడ, తోట మైదానం ఆ ప్రాంతాల్లో జరిగిన సంబరాల్లోనూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పోశాల పద్మ, ముష్కమల్ల అరుణ, జలగం అనిత, స్థానిక ప్రజాప్రతినిధులు, జీడబ్ల్యూఎంసీ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్త మానవాళికి మార్గదర్శి బాపూజీ

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి

**వరంగల్ వాయిస్, శాయంపేట :** సమస్త మానవాళికి మహాత్మా గాంధీజీ ఎంచుకున్న శాంతి, అహింసల మార్గం ఆచరణీయమని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అభిప్రాయపడ్డారు. గురువారం భారత జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా, బుచ్చిరెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి నూలు దారం మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఉప్పు సత్యాగ్రహం మరియు క్విట్ ఇండియా వంటి చారిత్రక ఉద్యమాల ద్వారా బ్రిటిష్ పాలనను బలహీనపరిచారు. ప్రపంచవ్యాప్తంగా సమానత్వం, శాంతి కోసం జరిగిన ఎన్నో పోరాటాలకు ఆయన జీవితం, సిద్ధాంతాలు ప్రేరణగా నిలిచాయని అన్నారు. సామరస్యం, సమానత్వం, న్యాయం కోసం గాంధీజీ తన జీవితాన్ని అంకితం చేశారని బుచ్చిరెడ్డి పేర్కొన్నారు.



"ఆయన కలలు కన్న సమాజాన్ని నిజం చేయడమే ఆ మహాత్ముడికి మనం ఇవ్వగలిగే ఘనమైన నివాళి" అని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారపల్లి రవీందర్, చిందం రవి, వైనాల కుమారస్వామి, దుబాసి కృష్ణమూర్తి, నిమ్మల రమేష్, వలి హైదర్, చింతల రవిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి, అహింస సిద్ధాంతాలు ప్రపంచానికి ఆదర్శం

- తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ నాయకత్వం వహించి నిర్వహించిన పాత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగినది అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. గురువారం భారత జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా వరంగల్ కొత్తవాడలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ, గాంధీజీ బోధించిన ముఖ్య సిద్ధాంతాలు, ఉద్యమ రూపాలు ప్రపంచాన్ని ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. సహాయ నిరాకరణ, సత్యాగ్రహం లాంటి పోరాట పద్ధతులు ఆయన నడవడిక, నిరాడంబర జీవితం, పాటించిన నైతిక విలువలు నేటికీ ఆదర్శనీయమన్నారు. భారత జాతిపితగా గాంధీజీని దేశ ప్రజలు తమ గుండెల్లో ఎల్లప్పుడూ ఉంచుకుంటారని తెలిపారు. గాంధీజీ కలలు కన్న సమాజంపై వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో అస్పృశ్యత, అంటరానితనం, కుల, మత వివక్ష పోవాలని, మత సామరస్యంతో ప్రజలంతా అన్నదమ్ముల్లాగా కలిసి మెలిసి శాంతియుతంగా జీవించాలని గాంధీజీ కోరుకున్నారు.



కానీ నేడు దేశంలో అలాంటి పరిస్థితి లేదని, కులోన్మాద, మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులు విజృంభిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మనిషిని మనిషిగా చూడడం కాదు కదా, కనీస మానవత్వం కూడా లేని రోజులు దాపురించాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో గాంధీజీ కలలు కన్న సమాజం కోసం, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగబత్తిని శంకర్, పల్నాటి సుధాకర్, బొద్దుల ప్రశాంత్, పెండ్యాల రాజేంద్ర చారి, దూడం పెద్దులు, బైరపాక సుహాస్, రమా, పుణ్యవతి, రాధ, స్వప్న, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# శమీ పూజతో శత్రువులపై విజయం

## జమ్మి చెట్టుకు మరుపల్ల రవి పూజలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** విజయదశమి రోజున జమ్మి చెట్టుకు (శమీ వృక్షం) శమీ పూజ నిర్వహించడం వలన శత్రువులపై విజయం సాధించవచ్చని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. దసరా పండుగ సందర్భంగా ఉర్సులోని శ్రీ బీరన్న స్వామి దేవాలయంలో ఆయన జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మి చెట్టును తాకడం పుణ్యప్రదమని, పాపాలను నశింపజేస్తుందని, భయంకరమైన రోగాలను కూడా నయం చేస్తుందని పురాణాలు చెబుతున్నాయని ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి గుర్తుచేశారు. మహాభారతంలో పాండవులు తమ అజ్ఞాతవాసం పూర్తి కాగానే, తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై ఉంచి పూజలు నిర్వహించిన తర్వాతే యుద్ధానికి సిద్ధమయ్యారు. ఆ తర్వాత శత్రువులైన కౌరవులపై విజయం సాధించారని, అందుకే విజయదశమి రోజున శమీ పూజ చేయడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉర్సు శ్రీ బీరన్న స్వామి దేవాలయ ధర్మకర్త మిర్యాల కుమారస్వామి, ఉర్సు కురుమ కుల సంఘం కోశాధికారి మరుపల్ల ఈశ్వర్ ప్రసాద్, సభ్యుడు మరుపల్ల శివ, మరుపల్ల గౌతం, చీర రమేష్, చింతపట్ల ప్రశాంత్, మరుపల్ల భార్గవ్, సాయి వర్ధన్, సతీష్ కుమార్ గౌడ్, ప్రణవి చంద్ర దేవ్ అయ్యగారు, బలబద్ర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శుక్రవారం తమ నివాసంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా నవంబర్ 23న నిర్వహించనున్న వరంగల్ ట్రై-సిటీ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నవంబర్ 23న ఘనంగా నిర్వహించనున్న వరంగల్ ట్రై-సిటీ హాఫ్ మారథాన్ (5 కి.మీ, 10 కి.మీ, 21.100 కి.మీ) కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ, క్రెడాయ్ తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు నేడు కుడా ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చరణ్, సరస్వతి చైర్మన్‌ను కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాఫ్ మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి, కౌటిల్ రెడ్డి, నలుబొల కార్తీక్ పాల్గొన్నారు. అనంతరం, పలువురు క్రైస్తవ మత పెద్దలు ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎంఎన్ఎస్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు దుపాకి దయాకర్, ఐపీసీ, వరంగల్ సెంట్రల్ ఏరియా పాస్టర్స్ అధ్యక్షులు రెవరెండ్ ఎం.ఎస్. శామ్యూల్ చైర్మన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

# బొల్లె భిక్షపతికి చల్లా పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ జడ్పీటీసీ బొల్లె భిక్షపతిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బిక్షపతి గారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులను మాజీ ఎమ్మెల్యే కోరారు. భిక్షపతి కుటుంబానికి అండగా ఉంటామని చల్లా ధర్మారెడ్డి హామీ ఇచ్చారు. ఆయన వెంట పరామర్శించిన వారిలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# శ్రీ మత్స్యగిరి స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపు



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలోని అతి పురాతనమైన, సుమారు ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో గురువారం దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. దసరా వేడుకల అనంతరం, శ్రీ మత్స్యగిరి స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి, డప్పు చప్పుళ్ల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపు అనంతరం మూర్తులను హరిజనవాడలోని జమ్మి చెట్టు వద్దకు తీసుకొని వెళ్లారు. అక్కడ జమ్మి చెట్టుకు ప్రదక్షిణాలు చేసి, దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ఆధ్వర్యంలో జమ్మి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజ పూర్తయిన తర్వాత భక్తులకు జమ్మి ఆకులను, కంకణాలను అందజేశారు. ఈ వేడుకల్లో దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, మారపల్లి రవీందర్, పాడి సమ్మిరెడ్డి తో పాటు వంగల పరమేశ్వరి రమేష్, సాధు నాగరాజు, బాసాని రాజు, గిద్దమారి సురేష్, ఉప్పు రాజు, మారపల్లి రమేష్, బెరుగు రాజు, భక్తులు పాల్గొన్నారు.

# దసరా వేడుకల్లో ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ కేంద్రంలోని అంగడి మైదానంలో జరిగిన దసరా పండుగ ఉత్సవాల్లో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి  కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రిమోట్ కంట్రోల్ సహాయంతో కూడిన బాణాసంచా ప్రదర్శనను ప్రారంభించారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఈ పండుగను ఐకమత్యంతో జరుపుకోవడం సంతోషదాయకమని తెలిపారు. సాంప్రదాయాలు, సంస్కృతి కొనసాగడానికి ఇలాంటి పండుగలు చాలా ముఖ్యమని ఆయన అన్నారు. నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలంతా సామరస్యంతో సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న దుర్గామాత నిమజ్జనం శుక్రవారం భక్తిశ్రద్ధలు, ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. మండల కేంద్రంలోని పోచమ్మ సెంటర్‌లో శ్రీ వేణుగోపాలస్వామి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. దుర్గామాత శోభాయాత్ర డీజే పాటలు, మహిళా భక్తుల కోలాటాలు, నృత్యాల మధ్య అత్యంత ఉల్లాసంగా సాగింది. భక్తులు మార్గమధ్యంలో మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. శోభాయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి భజన మండలి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా విజయదశమి వేడుకలు

## ◆ శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, రేగొండ :** ఉమ్మడి రేగొండ మండల కేంద్రంలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్ రెడ్డి ఇంటిలో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ పూజలు పూజారులు సముద్రాల సురేష్ ఆచార్యులు, నరేష్‌ల సమక్షంలో మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిగాయి. అనంతరం, గడిపల్లి గ్రామం ఆవరణలో ఏర్పాటు చేసిన సామూహిక దసరా (శమీపూజ) కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు జమ్మి ఆకుతో అలయ్ బలయ్ పంచుకుని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిశిధర్ రెడ్డి మాట్లాడుతూ శమీ వృక్షాన్ని పూజిస్తే శత్రువులు కూడా నాశనమవుతారని పేర్కొన్నారు. ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత ఉందని, పండుగలు ఏవైనా కులమతాలకు అతీతంగా, శాంతియుతంగా జరుపుకోవడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ ఏడునూతుల విజేందర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మైస బిక్షపతి సుమలత, మాజీ





ఉప సర్పంచ్ గండి తిరుపతి గౌడ్, పద్మశాలి సంఘం అధ్యక్షులు నామాల రమేష్‌తో పాటు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్లలో ఆయుధ, వాహన పూజలు..

రేగొండ మరియు గోరికొత్తపల్లి మండలాల పరిధిలోని పోలీస్ స్టేషన్లలో విజయదశమి వేడుకలను పోలీస్ సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. రేగొండ మండలంలో ఎస్సై రాజేష్ సమక్షంలో, అలాగే గోరికొత్తపల్లి మండలంలో ఎస్సై ఎస్. దివ్య గారి సమక్షంలో పోలీస్ స్టేషన్ కార్యాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజ అనంతరం, పురోహితులు వేదమంత్రాల మధ్య పోలీస్ సిబ్బంది ఉపయోగించే ఆయుధాలు మరియు వాహనాలపై పూజలు జరిపి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌లో విజయదశమి పండుగను జరుపుకొని ఆయుధ పూజ, వాహనాల పూజ నిర్వహించామని తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. పోలీస్ సిబ్బంది కూడా ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. వారు పోలీస్ సిబ్బందికి, రేగొండ, గోరికొత్తపల్లి మండల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# శ్రీ రాజరాజేశ్వరి దేవిగా బాలాజీ నగర్ రేణుక ఎల్లమ్మ తల్లి

## ◆ వైభవంగా వాహన, జమ్మి పూజ


**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల చివరి రోజు సందర్భంగా అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. రాజరాజేశ్వరి దేవి ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను వరాలుగా అనుగ్రహిస్తుందని, శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని పూజిస్తే కష్టాలు తొలగి అష్టైశ్వర్యాలతో కూడిన సుఖ జీవితం లభిస్తుందని భక్తుల నమ్మకం. ఆలయ పూజారి వాహనాలను శుభ్రం చేసి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి, గుమ్మడికాయలు, నిమ్మకాయలతో దిష్టి తీయించి వాహన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం, దసరా వేడుకల్లో భాగంగా జమ్మి పూజ విశేషాన్ని తెలియజేస్తూ, శ్లోకాలు స్మరిస్తూ చెట్టుకు ప్రదక్షిణ చేయించారు. భక్తులు ఒకరికొకరు అలాయ్ బలయ్ చేసుకుంటూ జమ్మి ఆకులను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో



నిర్వాహకులు దూడల రమేష్, తూముకుంట్ల వెంకట నర్సింహారెడ్డి, మోటె శ్రీనివాస్, దోసపాటి శ్రీనివాస్, పెండ్లి సత్తిరెడ్డి, మంగ శివశంకర్, పోగుల జైపాల్ రెడ్డి తో పాటు మహిళా భక్తులు దూడల శోభారాణి, లగిశెట్టి పద్మావతి, దోసపాటి శ్రీలక్ష్మి, కల్పన, ఆలేటి పద్మ, తూముకుంట్ల విజయ, కొల్ల బాలలక్ష్మి, బండోజు సరళ, కొలనుపాక సునీత, వాణి తదితరులు పాల్గొన్నారు.

# శాయంపేటలో దసరా వైభవం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో గురువారం దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రెండు ప్రధాన కార్యక్రమాలు మండల ప్రజలను ఆకర్షించాయి. ఒకటి ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో జరిగిన సంప్రదాయ శమీ పూజ, మరొకటి ఆర్.ఆర్. యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావణ వధ కార్యక్రమం నిర్వహించారు. అతి పురాతనమైన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో దసరా వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దసరా వేడుకల అనంతరం, శ్రీ మత్స్యగిరి స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి, డప్పు చప్పుళ్ల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపు అనంతరం మూర్తులను హరిజనవాడలోని జమ్మి చెట్టు వద్దకు తీసుకొని వెళ్లి, దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ఆధ్వర్యంలో జమ్మి పూజ నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు జమ్మి ఆకులను మరియు కంకణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి, మారపల్లి రవీందర్, పాడి సమ్మిరెడ్డి సహా వంగల పరమేశ్వరి రమేష్, సాధు నాగరాజు, బాసాని రాజు, గిద్దమారి సురేష్, ఉప్పు రాజు, మారపల్లి రమేష్, బెరుగు రాజు తదితర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా విజయదశమి రోజున రావణుడిపై రాముడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని శాయంపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఆర్.ఆర్. యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావణ వధ కార్యక్రమం మండల ప్రజల దృష్టిని ఆకర్షించింది. గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. సాయంత్రం వేళ పలు రకాల రంగురంగుల టపాకాయలు, భారీ బాంబులు పేల్చడంతో ఈ రావణ వధ



అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ విధంగా రావణ వధకు ప్రజలు తండోపతండాలుగా తరలిరావడం ఇదే మొదటిసారి కావడంతో, ఆర్.ఆర్. యూత్ అసోసియేషన్ ఏర్పాటును ప్రజలు ప్రశంసించారు, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులోనూ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిందం సాయి, భాషని అఖిల్, వినీత్, నాగరాజు, సందీప్ తదితర ఆర్.ఆర్. యూత్ నాయకులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, అక్టోబర్ 03, 2025

# నిర్భయ జర్నలిస్టు ఎం.ఎస్.ఆచార్య

◆ వందలాది మంది జర్నలిస్టులకు గురువు
◆ కొనియాడిన కన్న పరశురాములు



**వరంగల్ వాయిస్, జనగామ :** సత్యం కోసం అహర్నిశలు శ్రమించిన నిర్భయ జర్నలిస్టు, స్వాతంత్ర్య సమరయోధులు, వందలాది మంది పాత్రికేయులకు గురువుగా పూజించబడిన మహనీయుడు ఎం.ఎస్. ఆచార్య అని లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్, అగ్రగామి సంపాదకుడు కన్న పరశురాములు కొనియాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా స్వరం వినిపించి, ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చిన సామాజిక యోధుడు ఆయనని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు దశాబ్దాల పాటు దేదీప్యమానంగా ప్రచురించబడిన 'జనధర్మ' వారపత్రిక, ఆ తర్వాత 'వరంగల్ వాణి' దినపత్రిక వ్యవస్థాపక సంపాదకులు ఎం.ఎస్. ఆచార్య 101వ జయంతి వేడుకలు శుక్రవారం జనగామలోని ఎన్.ఎం.ఆర్. గార్డెన్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పలువురు జర్నలిస్టులు, పుర ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కన్న పరశురాములు, ఎం.ఎస్. ఆచార్య జీవిత ఘట్టాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 1925, అక్టోబర్ 3న సూర్యాపేటలోని మేనమామ ఇంట్లో జన్మించారు. ఆయన స్వస్థలం నెల్లికుదురు. వరంగల్‌లో చదువుకున్న ఆచార్య చిన్న వయసులోనే జాతీయోద్యమ వాతావరణంలో అడుగుపెట్టారు. నిజాం పాలనలోని అన్యాయాలను భరించలేక గాంధీ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1948లో ఆయన 'ఆంధ్రపత్రిక' వరంగల్ రిపోర్టర్‌గా జర్నలిజం వృత్తిని ప్రారంభించారు. 1958లో 'జనధర్మ' వారపత్రికను స్థాపించి, ప్రజాస్వామ్యానికి అద్దం పట్టేలా నడిపారు. అనంతరం 'వరంగల్ వాణి' అనే దినపత్రికను స్థాపించి స్థానిక సమస్యలు, ప్రజా వాణి, అవినీతిపై పోరాటాన్ని తన రాతలలో ప్రధానాంశాలుగా చేశారు. వరంగల్‌లోని ప్రధాన సమస్యల పరిష్కారం, అభివృద్ధికి పత్రికా ముఖంగా సూచనలు ఇచ్చారు. సాహితీ సంస్థలను ప్రోత్సహిస్తూ, అనేక మంది కవులు, కళాకారులను వెలుగులోకి తెచ్చారు.

లయన్ కన్నా పరశురాములు మాట్లాడుతూ "నేను మొదట్లో జనధర్మ పత్రికకు వార్తలు పంపి ఎం.ఎస్. ఆచార్య శిష్యుడిగా పత్రికారంగంలో ప్రస్థానం మొదలుపెట్టాను. వారి ఆశీస్సులతోనే 1981లో జనగామ నుంచి 'అగ్రగామి' వారపత్రికను ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నాను. ఉన్నత శ్రేణిలో ఉన్న వందలాది మంది జర్నలిస్టులకు ఆచార్య గురూజీ అని చెప్పడంలో సందేహం లేదు" అని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు చిన్న పత్రికల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనప్పుడు, వరంగల్‌కు రాగానే స్థానిక చిన్న పత్రికల సంపాదకుల సమావేశం నిర్వహించి, నన్ను సన్మానించి ఆశీర్వదించిన మహనీయుడు ఆచార్య అని గుర్తు చేసుకున్నారు. "జర్నలిజం అంటే నిజం చెప్పడమే, అవినీతికి తలవంచడం కాదు" అనేది ఆచార్య గారి నమ్మకం. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఆయన పత్రికలను మూసివేయాల్సి వచ్చింది. ఈ సంఘటన ఆయన మనసుకు భారమై, కొన్ని నెలల్లోనే 1994లో ఆయన జీవిత యాత్ర ముగిసింది. ఎం.ఎస్. ఆచార్య గారి నిబద్ధత, ధైర్యం, నిజాయితీ నేటి యువ జర్నలిస్టులకు శాశ్వత ప్రేరణగా నిలుస్తున్నాయి. ఆయన వారసత్వంలో రాణించిన వారిలో ఆయన చిన్న కుమారుడు మాడభూషి శ్రీధర్ (తరువాత న్యాయ శాస్త్ర ఆచార్యునిగా స్థిరపడి, సమాచార హక్కు జాతీయ కమీషన్ స్థాయికి ఎదిగారు), మరో శిష్యుడు సాయిబాబు (ఉదయం పత్రికలో పరిశోధన వ్యాసాలు రాశారు) ఉన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ఎన్. అనిల్ కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఎం.ఎస్. ఆచార్య పేరుతో జర్నలిస్టులకు అవార్డులు ఇస్తే బాగుంటుందని సూచిస్తూ వందన సమర్పణ చేశారు.

# యువతను తప్పదోవ పట్టిస్తున్న నేతలపై చర్యలు తీసుకోవాలి

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, యువతను చెడు మార్గంలోకి మళ్లిస్తున్న స్థానిక రాజకీయ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డోర్నకల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు డోర్నకల్ సీఐ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. అలాగే, డోర్నకల్ మండలంలోని గ్రామ గ్రామాన యువతకు అవగాహన కార్యక్రమాలు (అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్) కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ... సాంకేతికతతో పోటీ పడాల్సిన యువతను నేడు కొందరు లోకల్ రాజకీయ నాయకులు మద్యం, సిగరెట్లు వంటి చెడు వ్యసనాలకు అలవాటు చేసి వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచ దేశాల్లోని యువత తమ దేశ అభివృద్ధి గురించి ఆలోచిస్తుంటే, భారతదేశ యువతను మాత్రం రాజకీయం పేరుతో, సోషల్ మీడియా,



బెట్టింగ్ యాప్స్, చెడు వ్యసనాలకు లోను చేస్తూ పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు అందించాల్సిన ఉచిత విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలను విస్మరిస్తున్న ఈ రాజకీయ నాయకులకు భవిష్యత్తులో శ్రీలంక, నేపాల్‌కు పట్టిన గతి పడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల రాకేష్, డోర్నకల్ మండల కమిటీ సభ్యులు అబ్దుల్, లోకేష్, మహేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటక నర్సయ్య పంతులు సేవలు మరువలేనివి

**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** చేనేత సహకార ఉద్యమాన్ని ప్రారంభించిన మహనీయుడు గుంటక నర్సయ్య పంతులు 1903 అక్టోబర్ 3న జన్మించారని, ఆయన పద్మశాలీ సమాజానికి, చేనేతోద్యమానికి, విద్యారంగానికి అపారమైన సేవలు అందించారని బాపూజీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్ అన్నారు. గుంటక నర్సయ్య పంతులు 122వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జనగామ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో పద్మశాలి కుల సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెనుగొండ రమేష్, జనగామ జిల్లా పోపా (POPA) కార్యనిర్వాహక కార్యదర్శి చిదురాల ఎల్లయ్యతో కలిసి మేడారపు సుధాకర్ మాట్లాడారు. గుంటక నర్సయ్య పంతులు చేసిన సేవలను కొనియాడుతూ, ఆయన నైజాం రాష్ట్ర పద్మశాలి కష్ట నివారణ సంఘం ద్వారా వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన వ్యక్తి అని పేర్కొన్నారు. అలాగే, "భృగ్వాధుల ప్రభావం" అనే గ్రంథం రచించి, పద్మశాలీల సిసలైన చరిత్రను అందరికీ పరిచయం చేశారని తెలిపారు. తెలుగు పాఠశాలల ఏర్పాటు: బొంబాయి, సోలాపూర్, అహ్మద్‌నగర్, సూరత్ వంటి మహానగరాలలో స్థిరపడిన తెలుగువారి కోసం అక్కడి ప్రభుత్వాలతో చర్చించి తెలుగు పాఠశాలలను ఏర్పాటు చేయించారు.ఆయన కృషికి



గుర్తింపుగా 'యువక కిషోరమణి', 'చేనేతోద్యమ పితామహ' బిరుదులు లభించాయి. అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా, నైజాం రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం స్థాపకుడిగా, మరియు వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. 1946లో హైదరాబాదు నారాయణగూడ పద్మశాలి భవన్ కొనుగోలు సమయంలో కీలక పాత్ర పోషించారని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటంలో వెన్నుదన్నుగా నిలిచారని వక్తలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి చిదురాల మార్కండేయ, తెలంగాణ చేనేత ఐక్య వేదిక పాలకుర్తి మండల ప్రధాన కార్యదర్శి చిలుకమారి సోమేశ్వర్, విగ్రహ కమిటీ గౌరవ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వర్లు, చిలుకమారి ఉప్పలయ్య, ఎనగందుల శ్రీనివాస్, చిలుకమారి వరప్రసాద్, మార్గం సతీష్, చిలుకమారి శ్రీధర్, వల్లాల గౌరయ్య, చిదురాల దేవేందర్, చిలుకమారి ఆంజనేయులు, వసంత్, శివసాయి పాల్గొన్నారు.

# ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు




**వరంగల్ వాయిస్, మామునూరు :** నాలుగో బెటాలియన్ ఆవరణలో మహాత్మా గాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతులను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కమాండెంట్ ఈ. వీరన్న ముఖ్య అతిథిగా హాజరై, ఇద్దరు మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ ఈ. వీరన్న మాట్లాడుతూ "నా జీవితమే నా సందేశం" అని చాటిన మహనీయుడు గాంధీజీ. తన అహింసాయుత మార్గంలోనే సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని, ప్రజలు ఆయనను బాపూజీ అని పిలిచేవారని తెలిపారు. ఈ రోజున మరొక మహనీయుడైన లాల్ బహదూర్ శాస్త్రి జయంతి అని గుర్తు చేశారు. శాస్త్రి భారతదేశ రెండవ ప్రధాన మంత్రి అని, స్వాతంత్ర్య పోరాటంలో మొత్తం 9 సంవత్సరాలు జైలులో గడిపారని వివరించారు. గాంధీజీ ప్రభావంతో ఆయనకు, ఆ తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ గారికి శాస్త్రి నమ్మకమైన అనుచరుడు అయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, రాజ్ కుమార్, కృష్ణ, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లాలో దారుణం

## భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

## మద్యానికి బానిసై భార్యాభర్తల మధ్య విషాదం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని ఆలేరు గ్రామంలో పండుగ పూట దారుణం చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన భర్తను భార్య మందలించడంతో కోపోద్రిక్తుడైన భర్త గొడ్డలితో ఆమెపై దాడి చేశాడు. భార్య మెడపై గొడ్డలితో అమానుషంగా నరికి హత్య చేశాడు. భార్యాభర్తల మధ్య ఘర్షణ పండుగ పూట విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ధర్మారం గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఇంటి సుధేష్ణ దేవి కుటుంబాన్ని శుక్రవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సుధేష్ణ దేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం, ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

# గుడుంబా పట్టివేత

## ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** అక్రమంగా తరలిస్తున్న 42 లీటర్ల గుడుంబాను పట్టుకొని, సంబంధిత ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... నల్లబెల్లి మండలం, రేలకుంట గ్రామానికి చెందిన ముదు శారద మరియు హాలావత్ తిరుపతి అనే ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తయారుచేసిన 42 లీటర్ల గుడుంబాను టీవీఎస్ ఎక్సెల్ (నెం. టీఎస్ 24 డి 3863) పై ఆత్మకూరు మండల కేంద్రానికి తరలిస్తున్నారు. ఆత్మకూరు శివారులో పెట్రోలింగ్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నర్సింగరావు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్ కే, శ్రీనివాస్, స్వాతిలు వాహనాన్ని అడ్డుకొని గుడుంబాను స్వాధీనం చేసుకునే క్రమంలో నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే, పోలీసులు వారిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గుడుంబా విలువ సుమారు రూ. 8,400 ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా బోనగాని యాదగిరి గౌడ్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక శ్రీనగర్ కాలనీలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో గౌడ, బీసీ కులాల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న బోనగాని యాదగిరి గౌడ్ ఒక గొప్ప త్యాగశీలి అని కొనియాడారు. యాదగిరి గౌడ్ సేవలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఏదైనా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు డా. చిర్ర రాజు గౌడ్, తీగల భరత్, పెరుమాండ్ల అనిల్, ఏరుకొండ పవన్, శనిగరపు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దసరా వేడుకలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని నర్సింహులపల్లె గ్రామాల్లో దసరా వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా, గ్రామాల్లోని బొడ్రాయి వద్ద సొరకాయలు బలి ఇచ్చారు. అనంతరం, గ్రామస్తులు సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా బొడ్రాయి చుట్టూ, అలాగే జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి, దసరా ఉత్సవాలను జరిపారు. గ్రామ కార్యదర్శి ఆధ్వర్యంలో దసరా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నాగరాజు, నాయకులు కృష్ణ, చంద్రమౌళి, రామచందర్, రాజు, రత్నాకర్, శ్రీనివాస్, సురేందర్, సాంబయ్య, సంజీవ రెడ్డి, శ్రీను, దీలీప్, వంశీలతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిన ఘనత భారత్‌దే

- ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్
- ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిన ఘనత భారతదేశానికే దక్కుతుందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని సరస్వతి సంస్కార కేంద్రంలో గురువారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మకూరు ఉప మండల విజయదశమి ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాచం రమేష్ మాట్లాడుతూ డాక్టర్ హెడ్గేవార్ శతాబ్దం క్రితం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో స్థాపించిన ఆర్ఎస్ఎస్ నేడు శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. హిందూ సంఘటితం కోసం ఏర్పడ్డ సంస్థ ఆర్ఎస్ఎస్ అని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దేశభక్తి కలిగి ఉండి, ఎక్కడ ఏ సమస్య వచ్చినా ముందుండి సేవ చేసే తత్వాన్ని కలిగి ఉంటారని తెలిపారు. కులమతాలకు అతీతంగా ఆర్ఎస్ఎస్ నేడు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది శాఖలను కలిగి పనిచేస్తోందని, దేశంలో




సంభవించిన అనేక ప్రమాదకర సంఘటనల్లో ఆర్ఎస్ఎస్ సేవలు అందించినట్లు గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తప్పనిసరిగా 'పంచ పరివర్తన సూత్రాలను' పాటించాలని రమేష్ కోరారు. సామాజిక సమరసత కలిగి ఉండడం, స్వదేశీ సూత్రాన్ని పాటించడం, చట్టబద్ధమైన పౌర విధులను పాటించడం, భారత కుటుంబ విలువలను కాపాడుతూ పెంపొందించడం. అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యసాధనకు కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని ఆయన ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతిని పరిరక్షిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి భారతదేశంలో ఉందని, ఇది పాశ్చాత్య దేశాలలో కనిపించదని అన్నారు. భారత్ విశ్వగురు సాధనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త ఉప్పుల రవికుమార్, ఖండ కార్యవాహ కందగట్ల విజయకుమార్, జిల్లా సహకార్యవాహ ఉప్పునూతుల శంకర్, జిల్లా సంపర్క ప్రముఖ్ ఆర్. ఎల్.కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, అక్కంపేట గ్రామంలో జరిగిన ఉప మండల విజయదశమి ఉత్సవంలో జిల్లా ప్రచారక్ కడమంచి విఘ్నేష్, డాక్టర్ వాసరి నవీన్ కుమార్, జిల్లా ప్రచార ప్రముఖ్ ఇందూరి అంశాల్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీ లో ఘనంగా జమ్మి చెట్టు పూజ



**వరంగల్ వాయిస్, సుబేదారి :** విజయదశమి సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మరియు పాలకవర్గ సభ్యులు గురువారం రెడ్ క్రాస్ ఆవరణలో ఉన్న జమ్మి చెట్టు పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్: డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ విజయానికి నాంది విజయదశమి, అందరి జీవితాల్లో కొత్త వెలుగులివ్వాలన్నారు అనంతరం మహాత్మా గాంధీ జయంతి మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ని పురస్కరించుకొని అక్టోబర్ 2 గురువారం రోజున హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయ ఆవరణలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్ర పటానికి హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్



పూలమాల వేయడం జరిగింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయులందరిచే ఆదరింపబడే ఒక గొప్ప స్వాతంత్ర సమరయోధుడని, గాంధీ మార్గాన్ని అందరు అనుసరించాలని, అప్పుడే శాంతి సౌభాగ్యాలు వికసిస్తాయి. భారతదేశ రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నిజాయితీ పరుడు, మానవతావాదిగా పేరొందాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ. వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలక వర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. మాగంటి శేషు మాధవ్,బాశెట్టి హరిప్రసాద్, జీవితకాల సభ్యులు యాకుబ్ రెడ్డి, వేణుగోపాల్, చిర్ర రాజు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# "గాంధీ మార్గం అనుసరణీయం"

- రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) పరిపాలనా భవనంలో అక్టోబర్ 2న జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, గాంధీ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం మాట్లాడుతూ"నేటి తరం కోసం గాంధీ మార్గం అనుసరణీయం" అని అన్నారు. భారతదేశం శాంతికాముక దేశం అని, గాంధీ సిద్ధాంతాలు ఈనాడు ప్రపంచానికి అత్యంత అవసరమని చెప్పారు. హింస ద్వారా ఏదీ సాధించలేమని, అహింస మాత్రమే సర్వదా శ్రేయస్కరం అని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కూడా ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.శ్రీనివాస్, వసతి గృహ సంచాలకులు డాక్టర్ ఎల్. పి.రాజ్ కుమార్, గణిత శాస్త్ర విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు ఆచార్య పి. మల్లారెడ్డి, ఆచార్య బి. వెంకట్రాం రెడ్డి, సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్ పాల్గొన్నారు. ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీ రాజు వల్లాల సమన్వయకర్తగా వ్యవహరించారు.

వరంగల్
వాయిస్
సినిమా
శుక్రవారం 03
అక్టోబర్ 2025
7

# విమర్శలు సరికాదు

## - రాణిముఖర్జీ



ఇటీవల మొదటిసారి నేషనల్ అవార్డును అందుకున్న బాలీవుడ్ నటి రాణీ ముఖర్జీ ,జాతీయ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఆ పురస్కారాలు ప్రకటించినప్పుడు కొన్నిసార్లు వచ్చే విమర్శలపై స్పందించారు. అవార్డులు ప్రకటించినప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే వాటి విలువ తగ్గిపోతుందన్నారు. 'దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. మనకు నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు ప్రేక్షకులు కూడా మనం దానికి అర్హులమని భావిస్తే వచ్చే సంతోషం మాటల్లో చెప్పలేం. అలా కాకుండా 'ఆమె నటనకు పురస్కారం వచ్చిందా?. ఆమె కంటే గొప్పవారు చాలామంది ఉన్నారు' అని కామెంట్స్ వినిపించాయంటే దాన్ని అందుకున్నప్పటికీ విలువ ఉండదు. తాజాగా నాకు జాతీయ పురస్కారం వచ్చినప్పుడు అందరూ అంగీకరించారు. వారి అంగీకారం నాకు అవార్డు కంటే గొప్పగా అనిపించింది. నటీనటులకు చిన్న పురస్కారం కూడా ముఖ్యమే. ప్రేక్షకులను అలరించడమే మా ప్రధాన ఉద్దేశం. మాకు గౌరవం, గుర్తింపు వచ్చాయంటే అభిమానులు కూడా ఆనందిస్తారు' అని రాణి చెప్పారు. 2023లో విడుదలైన 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' సినిమాకు గాను రాణీ ముఖర్జీ ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు.



## రాజుగారి గది 4


ఆరేళ్ల గ్యాప్ తరవాత ఓంకార్ ప్రకటన తెలుగు ప్రేక్షకుల్ని భయపెట్టిన హారర్ ఫ్రాంచైజీ 'రాజు గారి గది' ఇప్పుడు మళ్లీ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతోంది. యాంకర్`డైరెక్టర్ ఓంకార్ ఆరేళ్ల గ్యాప్ తర్వాత ఈ సిరీస్‌లో నాలుగో భాగాన్ని ప్రకటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రం పేరు రాజు గారి గది 4: శ్రీచక్రం. తాజాగా విడుదలైన ఫస్ట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కాళికా మాత ఉగ్రరూపంలో దర్శనం ఇవ్వగా, ఎర్రచీరలో ఉన్న ఓ మహిళ దేవీ వైపు నడుచుకుంటూ వెళ్తుండటం హారర్, మిస్టికల్ ఎలిమెంట్స్‌ను సూచిస్తోంది. పోస్టర్‌కు జత చేసిన ట్యాగ్ లైన్ ఆసక్తి రేపుతుంది. ఈసారి కథా నేపథ్యం పూర్తిగా భక్తి, భయాల మిశ్రమంగా ఉండనుంది. 'కాళికాపురం' అనే ఊరిలోని కాళికా మాత ఆలయం, శ్రీచక్రం మహిమ, భక్తి వల్ల మేల్కొనే అమ్మవారు వంటి అంశాలతో హారర్, థ్రిల్లర్, కామెడీని మిక్స్ చేస్తూ ఓ కొత్త డైవైన్ యూనివర్స్‌ను నిర్మించనున్నట్టు చిత్రబృందం వెల్లడిరచింది. రాజు గారి గది హిట్ కావడంతో దానికి సీక్వెల్స్ చేస్తూ వస్తున్నారు ఓంకార్. ఇప్పటికే రాజు గారి గది2, రాజు గారి గది3 చిత్రాలు హిట్ కావడంతో రాజు గారి గది4 కు శ్రీకారం చుట్టారు. 'రాజు గారి గది 4: శ్రీచక్రం' సినిమా 2026 దసరా సందర్భంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రారంభ దశలో ఉన్న స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన తర్వాత షూటింగ్ మొదలవుతుంది. 2015లో వచ్చిన 'రాజు గారి గది' బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని నమోదు చేయగా, 2017లో 'రాజు గారి గది 2', 2019లో 'రాజు గారి గది 3' ప్రేక్షకులను అంతగా అలరించకలేకపోయాయి. అందుకే ఓంకార్ గ్యాప్ తీసుకుని మళ్లీ ఈ కొత్త కాన్సెప్ట్‌తో తిరిగి వస్తున్నారు. భక్తి, హారర్, థ్రిల్లర్ మేళవింపుతో 'శ్రీచక్రం' కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుంది.

## నాని సినిమాకు క్లాప్ కొట్టిన సుజిత్

ఓజి విడుదల కాక ముందే నాని హీరోగా దర్శకుడు సుజీత్ ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఏడాది దాటినా మరో అప్‌డేట్ లేకపోవడంతో ఈ చిత్రం క్యాన్సిల్ అయిందనే రూమర్స్ ఇటీవల వచ్చాయి. 'ఓజీ' ప్రమోషన్స్‌లోనే సుజీత్ వాటికి చెక్ పెట్టారు. నానితో సినిమా ఉంటుందని స్పష్టం చేశారు. తాజాగా ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దసరాని పురస్కరించుకుని ఈ సినిమాని లాంఛనంగా హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఈ వేడుకకు హీరో వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంబంధిత ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. సినిమాలోనూ కలిసి నటిస్తున్నారా? అంటూ అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుందని, మరిన్ని అప్‌డేట్స్ రాబోతున్నాయని నిర్మాత వెంకట్ బోయనపల్లి తెలిపారు. సుజీత్ 'ఓజీ' విజయాన్ని ఆస్వాదిస్తుండగా.. నాని 'ది ప్యారడైజ్'లో నటిస్తున్నారు. 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న చిత్రమిది. నానితో చేయబోయే సినిమా 'ఓజీ' యూనివర్స్‌లోకి వస్తుందా? అన్న ప్రశ్నకు ఇటీవల సుజీత్ సమాధానమిచ్చారు. తన తొలి సినిమా 'రన్ రాజా రన్' స్టైల్‌లో ఉంటుందని, 'ఓజీ' యూనివర్స్‌లో భాగం కాదని తెలిపారు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. కానీ, అధికారిక ప్రకటన లేదు.



## ఆనాడు ఒక్క షో ప్రదర్శన కోసం కష్టపడ్డా



### కాంతారా విజయం మర్చిపోలేనిదన్న రిషబ్ శెట్టి

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార చాప్టర్ 1' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఆయన గత రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 2016లో తన సినిమాను ఒక్క షో ప్రదర్శించడం కోసం ఎంతో కష్టపడినట్లు చెప్పారు. ఈరోజు తనకు దక్కుతున్న గౌరవం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2016లో నా చిత్రం సాయంకాలం షో ప్రదర్శించడం కోసం పడిన కష్టం నుంచి 2025లో 5000కు పైగా థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించే వరకూ ఇదీ.. దర్శకుడిగా నా జర్నీ. ఈ సినీ ప్రయాణం దేవుడి దయతో పాటు మీ ప్రేమాభిమానాలను ఎప్పటికీ మర్చిపోలేను. మీ ఆదరణతోనే ఈ విజయం సాధ్యమైంది. నన్ను ఆదరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతల అంటూ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2012లో 'తుగ్లక్' అనే సినిమాతో తన కెరీర్ ప్రారంభించిన రిషబ్ శెట్టి నటుడిగా, దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొదటిసారి 2016లో 'రిక్కీ' అనే సినిమాకు దర్శకత్వం వహించారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన ఆ సినిమా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. 2022లో ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కాంతార'కు జాతీయస్థాయిలో గొప్ప గుర్తింపు వచ్చింది. చిన్న సినిమాగా విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకొని అవార్డులు తెచ్చింది. ఇప్పుడు దీని ప్రీక్వెల్‌గా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'కూడా అదేస్థాయిలో ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే.

### కాంతారా చాప్టర్`1 కు అభినందనల వెల్లువ

దసరా పండుగ కానుకగా అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదలైన 'కాంతార: ఛాప్టర్ 1' సినిమా ప్రేక్షకుల నుంచి విశేష స్పందన పొందుతోంది. రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పాన్`ఇండియా ఫాంటసీ డ్రామా మరోసారి దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. భక్తి, మానవత్వం, పరబ్రహ్మ భావనల మేళవింపుతో వచ్చిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు మాత్రమే కాకుండా ఇండస్ట్రీ ప్రముఖులు కూడా అభినందిస్తున్నారు. ఇప్పటికే జూనియర్ ఎన్టీఆర్ సినిమా బాగుందని ట్వీట్ చేయగా, తాజాగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరియు అర్జున్ రెడ్డి ఫేమ్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కూడా సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్ఆడుతూ...కాంతార: ఛాప్టర్ 1 నిజమైన మాస్టర్ పీస్ అంటూ సినిమా గురించి ప్రశంసలు కురిపించారు. ఇండియన్ సినిమా చరిత్రలో ఇలాంటి సినిమాను ఎప్పుడూ చూడలేదు. ఇది ఓ సినిమాటిక్ ప్రభంజనం. భక్తి ఎలా ఉంటుందో రిషబ్ అద్భుతంగా చూపించారు. ఇది ఆయన ఒంటి చేత్తో తీసిన సినిమానే కాదు, ఒక ఆధ్యాత్మిక ప్రయాణం. సినిమా బీజీఎమ్‌ను ఎంతగా పొగడినా తక్కువే, అంటూ పేర్కొన్నారు. అలాగే, ప్రభాస్ తన సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ.. కాంతార: ఛాప్టర్ 1 అనేది ఒక బ్రిలియంట్ మూవీ. ఇది ఈ ఏడాది బిగ్గెస్ట్ హిట్ గా నిలుస్తుంది.

# ఘనంగా శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం





- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ముగిసిన దేవీశరన్నవరాత్రోత్సవాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవిశరన్నవరాత్రులు విజయ దశమితో ముగిశాయి. ఉదయం నిత్యాహ్నికం నిర్వర్తించి కలశోద్వాసన జరిపి అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం జరిపిన పిమ్మట చక్ర తీర్థోత్సవం (చక్ర స్నానం), ద్వజావరోహణం జరిపించారు. దాదాపు ఎనభై వేల మంది విజయ దశమి రోజున అమ్మవారిని దర్శించుకున్నారు. శమీ వృక్షానికి పూజ చేసి శమీ పత్రాలను (జమ్మి ఆకులను) భక్తులు పరస్పరం పంచుకున్నారు. అమ్మవారిని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం..

శుక్రవారం మధ్యాహ్నం అమ్మవారికి శతఘటభిషేకం నిర్వహించారు. తదుపరి సాయంకాలం 7 గంటలకు దేవాలయ ప్రాంగణంలో అందంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో జరిగిన శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం ఆద్యంతం భక్తులను ఒక దివ్యానుభూతికి గురిచేసింది. కళ్యాణం అనంతరం భగవత్ప్రసాదంగా భక్తులకు రుచికరమైన



విందు ఏర్పాటు చేయడం జరిగింది. కళ్యాణం రోజు ఉపయుధాతలుగా మంచాల శ్రీకాంత్–కవిత దంపతులు, మంచాల నవీన్–స్వప్న దంపతులు, యాద కిషన్–శోభ దంపతులు, రేగురి ఆంజనేయులు–సరళ దంపతులు వ్యవహరించారు. ఈ కళ్యాణోత్సవం వరంగల్ ప్రముఖ వ్యాపారవేత్తలు ఇరుకుల్ల నాగేశ్వరరావు–శ్రీదేవి దంపతుల సౌజన్యంతో నిర్వహించారు. దేవీ నవరాత్రులలో పది రోజులుగా అయితా గోపినాథ్ ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళీ భక్త సేవా సమితి ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ అశేష అన్నదానములు భక్తుల ప్రశంశలకు పాత్రమయ్యాయి. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ డాక్టర్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోత్కూరి మయూరి, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాసరావు, మూగ శ్రీనివాసరావు, ఎక్స్ అఫీషియో మెంబర్ పార్నంది నరసింహ మూర్తి, కార్యనిర్వహణాధికారి రామల సునీత తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని..

విజయదశమి సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సతీమణి నీలిమ రెడ్డి, కుమార్తె, అల్లుడు డాక్టర్ నాయిని శ్రీ గోధా విష్ణువర్ధన్ రెడ్డి మొదట భద్రకాళి అమ్మవారిని ఆ తరువాత వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శచించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యలతో నిండునూరేళ్ళు వర్ధిల్లెలా దీవించాలని ఆ అమ్మవార్లను కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.



## అందరి బంధువు 'దత్తన్న'

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** అందరి బంధువు బండారు దత్తాత్రేయ అని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కొనియాడారు. సీనియర్ బీజేపీ నాయకుడు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించిన అలయ్–బలయ్ కార్యక్రమంలో గంట రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మా లాంటి అనేక మంది కార్యకర్తలకు దత్తాత్రేయ స్ఫూర్తి ప్రదాత అన్నారు. దత్తాత్రేయ అనగానే రెండు పండుగలు గుర్తొస్తాయన్నారు. ఒకటి హోలీ, రెండోది అలయ్ బలయ్. హోలీ పండుగను దత్తాత్రేయ చాలా గొప్పగా నిర్వహిస్తారు. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే అన్నట్లు కేంద్రమంత్రి అయినా, గవర్నర్ అయినా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలనే ఉద్దేశంతో గత 20 సంవత్సరాలుగా దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారన్నారు. మనుషుల మధ్య స్నేహం పెరగడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రజల మధ్య అంతరాలు తగ్గించి.. సమాజాన్ని సంఘటితం చేయడం కోసం దత్తాత్రేయ కృషి చేస్తున్నారన్నారు. ఈ సంస్కృతి రాబోయే తరాలకు స్ఫూర్తి. దత్తాత్రేయ చూపిన బాటలో అందరూ నడవాలని గంట రవికుమార్ సూచించారు.

# దారి ఇలా.. నడిచేదెలా..?

- అధ్వానంగా వెలికట్టె-సన్నూరు దారి
- వర్షాలతో బురదమయమైన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, వాహనదారులు

**వరంగల్ వాయిస్, రాయపర్తి (తొర్రూరు) :** ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని సన్నూరు–తొర్రూరు మండలం వెలికట్టే గ్రామాలకు లింకు రోడ్డుగా ఉన్న దారి అధ్వాన్నంగా తయారవడంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మంచిగా ఉన్న దారిని ఎండాకాలంలో ఉపాధి హామీ పనులు చేయించి ఇప్పుడు బురదమయంగా మార్చారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బైకులు, ఆటోలు, ట్రాక్టర్లు సులభంగా వెళ్లేలా ఉన్న రోడ్డు కరువు పని చేసి నల్లమట్టి పోయడంతో కొద్దిపాటి వర్షానికే నడవలేకుండా తయారవుతుందని స్థానికులు వాపోతున్నారు. వ్యవసాయ బావుల వద్దకు కనీసం కాలినడకన కూడా వెళ్లలేకపోతున్నామని, అడుగు ఒకచోట వేస్తే మరో చోట పడుతుందని, బురద సమస్య తీవ్రంగా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక ద్విచక్ర వాహనదారుల బాధ వర్ణనాతీతంగా మారింది. బైకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారని, ట్రాక్టర్లు కూడా ఈ దారి గుండా వెళ్లలేకపోతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో గ్రహించాలని వ్యవసాయదారులు వేడుకుంటున్నారు. వర్షం వస్తే రాత్రి, పగలు కూడా పొలాల వద్దనున్న పశువుల వద్దకు, మోటార్లు పెట్టడడడానికి కూడా వెళ్లలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సన్నూరు వెలికట్టే గ్రామాల మధ్య పక్కా రోడ్డు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అలాగే దారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగి ఇబ్బందికరంగా ఉన్నాయని, వెంటనే వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com